# రసాన్విత

యామినీ సరస్వతి

11 ఏప్రిల్ '97
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక




## ● కథానిక

హంస కాలేజీ నుంచి వచ్చేసరికి యింట్లో వాతావరణమే కొత్తగా కనిపించింది. మధుమాసం వచ్చినట్టు వెన్నెల రేయి విరిసినట్టు అంతా పూలబాసలు వినిపిస్తున్నట్టుగా వుంది. పుస్తకాలు టేబుల్‌పై పెట్టి టాయ్‌లెట్ అయి వచ్చేసరికి వేడి వేడి పొగలు చిమ్మే కాఫీ కప్పు సాసరుతో సహా ఎదురొచ్చింది. పొగల వెంట అగరువాసనలా అత్తయ్య కూడా నవ్వుతూ వుంది. హంస కాఫీ కప్పు అందుకుంది. రిలాక్స్ చెయిర్‌లో కూర్చుంది.

'రేపు మినీ గారొస్తున్నారు'

మన్మధుడి విల్లు అలా వొంగి యిలా విడిపో యినట్టుగా హంస కనుబొమలు కదిలాయి.



'నీకు అమ్మమ్మ అవుతారు. గుర్తుండే వుంటుంది.'

'పరమశివంగారి భార్య రుక్మిణి.. ఆమెని ఆమె ఆరాధకుడు రాఘవ మినీ అని పిలుస్తారనే వాళ్లు. ఆవిడే కదూ!'

'అవును. రుక్మిణి అనే పేరులో మినీ అనే అందం కనుగొన్నారామె'

'వస్తే ఏమిటట?'

'నీకు తెలియదు... ఆమె వస్తే అన్నీ చక్కబడ తాయి' హంస మాట్లాడలేదు. మౌనంగా కాఫీ తాగు తోంది. రసాస్వాదన వేళలో చర్చ వుండకూడదు. కమ్మని కాఫీ తాగినా– పండు తిన్నా– భోజనం



చేస్తున్నా- రసగుల్లాలాటి స్వీటు తింటున్నా నిశ్శబ్దంగా- ప్రశాంతంగా ఆనందం వర్షించేట్టు ఆరగించాలి. అదీ హంస తత్త్వం.

"దీపావళి వస్తే దాని వెంట పండ్లు, పూలు, స్వీట్లు వచ్చి మతాబులు, కాకర పువ్వొత్తులు, చిచ్చుబుడ్లు వస్తాయి. ఉగాది వస్తే దానివెంట మల్లెపూలు, మామిడి కాయలు, ఉగాది పచ్చడి, కొత్త బట్టలు వస్తాయి- మినీ వస్తే ఆమె ఒక్కతే రాదు. వెంట ఆనందం, సంతోషం, సంబరం, సందడి వస్తాయి" అంది మీనాక్షి.

'మీరంతా ఆవిడ కెందుకంత గౌరవం ఇస్తారు'

'ఏం తప్పా?'

'తప్పని కాదు. ఒప్పని కాదు. ఆవిడ వస్తోందంటే ఎక్కడలేని ఆర్భాటం... అదీ..'

'ఎవరూ చెయ్యరు. అవన్నీ అలా వచ్చేస్తాయంతే.'

చంద్రోదయంతో వెన్నెల విరిసినట్టు-ఏర్‌కండీషనర్‌తో చల్లదనం వచ్చినట్టు!

'సంబడం! అందుకేనా యిల్లంతా అంతగా హడావిడి చేసేస్తున్నారు'

'అందుకనే కాదు. రేపే ఉగాది కదా!'

'నాకు గాదులు లేవు. నా కుషస్పులు లేవు-' నవ్వుతూనే అంది హంస. నవ్వుతూ అన్నీ ఆ మాట వెనుక విషాదం సితారాపై మావ్‌కోసే పలికినట్టు పలికింది.

'మా ఆలోచనా అదే! ఆవిడొచ్చిందో... విగ్గేల కృష్ణశాస్త్రికి ముగ్గేలా తాజమహలు ముని వాకిటిలో అన్నట్టు అన్నీ తీరిపోతాయి. వయసు వచ్చి వంకరలన్నీ తీర్చినట్టుగా సమస్యలనేవే వుండవు-'

'ఏమిటో అంత నమ్మకం'

'సూర్యోదయమైతే యింకా చీకట్లుంటాయటే!'

'అత్తయ్యా! నాకు చీకట్లు వున్నట్టు లేదు' గంభీరంగా అంది హంస.

'మన సంగతి మనకి తెలియదమ్మా. ఇతరులకే బాగా తెలుస్తుంది.'

'రానీ... రానీ... వస్తే రానీ...' అనుకుంది హంస. మాటలు రెట్టించలేదు. మీనాక్షిగారూ ఏమీ అనలేదు. అంతలో బయట సందడే సందడి. వరద గోదావరి పరవళ్ళు తొక్కుతున్నట్టు- లేపాక్షి బసవయ్య లేచి వచ్చేస్తున్నట్టు- తొలకరి చినుకులు పడగానే మట్టివాసన వెదజల్లినట్టు...

'అదిగో... వచ్చేసింది!' మీనాక్షిగారు వెళ్ళిపోయారు.

** ** **

రాత్రి అపరాత్రి అయ్యేదాక పాటలు కబుర్లు



**సుస్మిత భాషణం**

నా మీద గ్యాసిప్ మ్యాసులు రాసి పత్రికల సేల్స్ పెంచుకుందామంటే కుదరదు. నేనిప్పుడు పూర్తిగా మారిపోయాను. పత్రికల వారితో ఇంతకు పూర్వంలా నేను ప్రవర్తించడం లేదు అని ఇటీవల అంటోంది సుస్మితా సేన్. దీనికి కారణం ఏంటంటే విక్రమ్‌తో తన లవ్ ఎఫైర్ విషయంలో పత్రికలు అతిగా జోక్యం చేసుకున్నాయని కోపంగా ఉందట!

పాటాలు మినీ కవితలు జోకులు...

"ఇంకేం నిద్రపోతాం! వచ్చేసింది. వచ్చేసింది. ఉగాది వచ్చేసింది. ఈశ్వరనామ సంవత్సరం వచ్చేసింది" అన్నాడు సంపత్.

'ఇదేం ఇంగ్లీషు న్యూయిర్ జనవరి ఫస్టనుకున్నావా! పన్నెండు దాటిపోగానే హ్యాపీ న్యూయిర్ అని చెప్పడానికి. ఇది తెలుగు సంవత్సరం. మనకి వారం సూర్యోదయం నుంచి సూర్యోదయం దాకా. మంగళవారం వస్తేనే కానీ పాడ్యమి మొదలయినా ఉగాది రాదు పంచ పంచ ఉషః కాలంలో మనకు ఉగాది పుట్టుకొస్తుంది' అంది మినీ.

'అబ్బ! మీదంతా ఛాందసం. నాది పాత కొత్తల మేలు కలయిక. గుత్తునా ముత్యాల సరములు అన్నట్టుగా ఈస్ట్ అండ్ వెస్ట్‌ని కలిపేద్దాం మనం. అన్ని పండగులు మనవే. నేనయితే జనవరి ఫస్ట్‌కి న్యూయిర్ గ్రీటింగ్స్ చెబుతా. తెలుగు ఉగాదికీ చెబుతా! పండుగ పండుగ అంటే ఏమిటి? ఆనందంగా వుండటమే కదా!' అన్నాడు సంపత్.

'బావుంది... నా సిద్ధాంతానికి నువ్వొకడివి ఐతయ్యావు'

'అంతే కాదూ అమ్మమ్మా! జాలీ ట్రిప్పుకో ఎక్స్‌కర్షన్‌కో మనం శ్రీశైలానికో ఎత్తిపోతలకో వెళతాం అనుకో. అక్కడ చర్చలు తగాదాలు పెట్టుకుంటామా? ఈ లైఫ్ అంతే. సుఖించరా ఆనందించరా మానవ జీవితం అరుదైందిరా అందులో భారతదేశంలో- ఆంధ్రదేశంలో మరీ అరుదుగా అని మనని పుట్టిస్తే హాయిగా జాయ్ అండ్ ఎంజాయ్ అనిగడిపెయ్యక... ఏమిటి యీ స్పర్ధాలు.. మోసాలు.. వెనుక దగా ముందు దగా అన్నట్టు.. ఐ డోంట్ 'లైక్' అన్నాడు సంపత్.

అతడిలో ఆవేశం పాళ్ళెక్కువ అని గ్రహించింది మినీ.

పక పక నవ్వేసింది.

'అవును- నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు! అనుకుంది ఇదంతా గమనిస్తోన్న హంస.

ఆమె గడియారం వైపు చూసింది. అది గుర్తించాడు సంపత్. అందుకున్నాడు 'అదిగో ఆధునికతకు సంకేతం గడియారం. ఒకప్పుడు మన వాళ్లు వేగు చుక్కల వల్ల-సప్తర్షి మండలం గమనం ద్వారా వేళ తెలుసుకునేవారు. ఆపై కోడికూతతో తెల్లారేవి పల్లెటూళ్లు. ఇప్పుడు సైరన్ కూతతో సమయం గడియారంతో కాలం తెలుస్తుంది. ఇది మార్పు. అది సహజం- అలాగే అన్నీ.'

'సరే! ఎలాగూ మూడు కావస్తోంది ఇక యిప్పుడేం నిద్దర్లు—తలంట్లు కానివ్వండి' అంది మీనాక్షి గారు.

'నిద్రపోయేవారు నిద్రపోతూనే వుంటారు. కదిలేది కదిలించేదీ పెను నిద్దర వదిలించేది అన్నట్టు తెల్లారబోతూ వుంటే ఇంకేం నిద్దర్లు?' అంది మినీ.

హంస లేచింది.

'ఎక్కడికమ్మా!'

'బ్రష్ చేసుకుని వస్తా!'

'నేను వస్తా పద!'

మినీగారు వెంట తగులుకున్నట్టు అనిపించింది హంసకు.

'సరే! భయపడితే ఎలా? వస్తుందనుకున్న ఉగాది రానే వచ్చింది. దాంతోపాటు ఈవిడా వచ్చింది... ఏం జరుగుతుందో చూద్దాం" అనుకుంది హంస.

** ** **

తెల్లగా తెల్లారిపోయింది.

మినీగారు చిలుకాకు పచ్చ జరీ నేత పాటూరు పట్టు చీర కట్టుకున్నారు...

హంస ఎగాదిగా చూస్తోంది. "ఈవిడ కెన్నేళ్లు?.. తన లెక్క ప్రకారం అరవై దాటుతుండాలి.. కానీ మూడు పదుల వయస్సు దగ్గరే ఆగిపోయినట్టు అనిపిస్తుంది. అలంకరణ సరే... శరీరం...'

తల దువ్వుతూ అడిగింది మినీ. "రామకృష్ణ రావడం లేదా?"

ఆ ప్రశ్న ఆమె అడుగుతుందని తెలుసు. అందుకే రెడీగా వున్న సమాధానం చెప్పింది. 'రామా కృష్ణా అంటూ మీ వయస్సువాళ్లు కాలం గడిపినట్టుగా నన్ను యీ వయస్సులో అలాగే కాలం గడపమన్నట్టు అందరూ చేశారుగా! అలాగే వున్నా!'

పకపక నవ్వింందామె. చక్కని తెల్లని పలువరుస. ముత్యాలు మెరిసినట్టు, రత్నాలు వొలికినట్టు.. 'ఒసే వెర్రిదానా.. నిన్ను రామా కృష్ణా

అని గడపమనలేదే! కృష్ణా రామా అని గడప మన్నాం–'

'దానికీ దీనికీ తేడా ఏమిటి?'

'కృష్ణతత్త్వంలో ముందు జీవితం సుఖించి హాయిగా నిష్పూచీగా గడిపేసి ఆపై రామతత్త్వంలో మోక్షం అందుకోమన్నారే మనవాళ్లు. మనకి సుఖించడం తెలిసినంతగా ఇతర దేశీయులకి తెలీదు. మనది కర్మభ్యూ దేశం. మనది ధర్మణ్యా దేశం–'

హంస సాలోచనగా చూసింది.

'నీ పేరేమిటి పరమహంస. నీళ్ళు కలిసిన పాలిచ్చినా పాలూ నీళ్ళూ వేరు వేరు చేసి పాలను తాగేస్తుంది హంస. అలా కష్టసుఖాలు కలివిడిగా వచ్చినా సుఖాలని అందుకోవాలనే నీకా పేరు పెట్టారు. అంతే కాదు. నీ మేనత్త కొడుకు రామ క్రిష్ణకి తగ్గట్టుండాలని పరమహంస అని పెట్టారు. అతనికి నిన్నిచ్చి పెళ్లి చెయ్యాలని నీ నామకరణం నాడే నిశ్చయం అయ్యింది. అందుకే మీలాగే పేర్లు కలిసి పోవాలనే–రామక్రిష్ణ పరమహంస–అవాలని పెట్టారు.'

కొత్త విషయం విన్నట్టుగా చూసింది పరమ హంస–హంస

'అవునమ్మా... ఇంతకీ అతనే మంటాడే?'

'ఏమన్నాడే... రాముడేమన్నాడే...?'

'మన్నాడే... ఏమన్నాడే...' తనూ జోవియల్‌గా అంది మినీ.

'ఏమంటాడు? ఫోన్ చేస్తే మొలక నవ్వులు చిందిస్తూ–మృదు మధురంగా నవ్వుతూ రేపు వస్తానంటాడు. ఆ రేపు ఎప్పుడు? ఎప్పుడడిగినా రేపు రేపు అనే అంటాడు. ఆ రేపుకి రూపు లేదు. అతను రాడు. దసరా గడచింది. దీపావళి వెళ్ళింది. ఉగాది యీ రోజొచ్చిందా రేపటికి వెళ్ళి పోతుంది. శ్రీరామనవమి వస్తుంది. అదీ వెళ్తుంది అతడు రాడు. వసంతం రాదు.' సీరియస్‌గా అంది హంస.

'అమ్మో! ఈ పిల్ల బాంబ్ షెల్‌లా వుంది. షెల్లీ కవితలా, దేవులపల్లి కవితలా ముగ్ధంగా వున్నా శ్రీశ్రీ కవితలా నిప్పులు విమ్ముతుంది' అనుకుంది మినీ.

'ఈసారి అలా కాదులే!'

'ఏమిటా విశేషం?'

'ఇది ఈశ్వరనామ సంవత్సరం. మళ్ళీ అరవై ఏళ్ళకే వస్తుంది... అన్నట్టు నేను పుట్టింది ఈనాడే...'

" 'నేను' పుట్టింది మనిషి వెంటనే. ఆ 'నేను' అనేది లేకపోతే యీ ప్రపంచమే లేదు' అనుకుంది హంస. మళ్ళీ 'ఈవిడకి అరవయ్యేళ్లా?' ఆశ్చర్యం..'

'షష్టిపూర్తి అయ్యిందా అని అనుమానమా?' అడిగింది మినీ.

అవునూ! మీకు షష్టి పూర్తయ్యిందా?' అడిగింది హంస.



## ఆశల ఉగాది

సురలోకపు అమృతధారలు
ఇల యీ లోకంలో అరుదైనవి.
కనుక కలిగిన నీ కలో–గంజో
పదిమందికి పంచిపెట్టవోయ్.
పలురకాల బరువు బాధ్యతలు
భరియిస్తూ మానవాళిలో
పరిమళాల నవ్వుల పువ్వులు
పదిమందికి పంచిపెట్టవోయ్.
అరుదైన భావ తంపరతో
బరువెక్కిన నీ కవి హృదయాన్ని
సరదాగా కవితలు రాసి
పదిమందికి పంచిపెట్టవోయ్.
'నాది', 'నా'యను స్వార్థంతో
నరకమైన యీ లోకంలో
'మనది', 'మనమ'ను మమతను
పెంచి
పదిమందికి పంచిపెట్టవోయ్.
చేదు గతాన్ని
వగరైన వర్తమానాన్ని
కారమైన నిజాల్ని
నీరుగారని ఉప్పను
పుల్లని మాసిరిసాన్ని
తియ్యని భవితతో కలిపి
కొత్త రుచులతో, కొత్త ఆశలతో
కొత్త భావనతో, కొత్త భవితలతో
అన్నీ కలిసిన ఉగాది పచ్చడి
అందరికీ పంచిపెట్టవోయ్.

–శశికళా ప్రభాకర్.

'షష్టి కాదే వెర్రి తల్లీ షష్టి! షష్టి అంటే ఆరు! షష్టి అంటే అరవై! ఈ రోజుతో షష్టి పూర్తయ్యింది. మా పూరెళ్లాక ఆయన నేనూ కలిసి షష్టి పూర్తి జరుపుకుంటాం.'

'అదేంటి? ఆయనకి షష్టిపూర్తి కాలేదా? అప్పుడు జరుపుకోలేదా?'

'భలేదానివే! ఆయన నాకన్నా చిన్నవారనుక న్నావా కొంపదీసి?

నా కంటే దాదాపు రెండేళ్లు పెద్ద. అప్పుడూ జరుపుకున్నాం. ఇప్పుడూ జరుపుకుంటున్నాం. భర్తకేనా షష్టిపూర్తి భార్యకీ షష్టిపూర్తి జరగాలన్న దాశరధి రంగన్నగారిలాగా మేమూ జరుపుకుంటున్నాం. అదొక సంప్రదాయం అవుతుంది.'

'సంప్రదాయమంటే అంతే కదా! అంత కడివెడు పాలపై ఒక్కింత మీగడ తేరినట్టుగా మనకు మిగులును గతము లోపలి నుంచి అదియే సంప్రదాయం' అది హంస సి.నా.రె.ని గుర్తు చేసుకుంటూ–

"అమ్మో! ఏమో అనుకున్నా తెలుగు పిల్లవి అనిపించావు'

అంతలో మీనాక్షి వచ్చింది.

'రామ్మా! రా!' ఏమిటి సంగతి... ఇదిగో... ఈ పిల్లకు జడేసేక వంటింట్లోకి వస్తా. పేణీలు ఇష్టం అని కదా హంసకి. చేసి పెడతాలే–'

'ఉగాదికి భక్ష్యాలు... అదే బొబ్బట్లు... స్పెషల్ కదా. అవి చేసేస్తున్నారు పిల్లలంతా... అది సరే. రామక్రిష్ణ వచ్చాడు...'

ఒక్కగుంజు గుంజి– జడని సాగదీసి వీపున గుద్దింది మినీ...

'అదేం సంకేతం?' అనుకుంది హంస.

'ఇదిగో హంసా! వస్తా వస్తా అని వూరించి వూరించి ఇన్నాళ్ళూ రాని పిల్లాడొచ్చాడు. పాత కోపం మనస్సులో పెట్టుకొని జడతో కొట్టేవు. అసలే నాజూకు మనిషి దెబ్బకి తట్టుకుంటాడో లేదో...' అంది మినీగారు.

ఆపుకోలేక ఫక్కున నవ్వింది హంస! అది చూసిన మీనాక్షికి వెన్నెల విరిసినట్టైంది.

'నేను చెప్పలా? నీ చేతిలో ఏదో వరుసనేది వుందమ్మా. హంసని మార్చేశావు మాటల్లో పెట్టి! శుభ సూచకం అన్నట్టు రామక్రిష్ణ వచ్చాడు! వాళ్లని పునస్సంధానం చేసేసి పుణ్యం కట్టుకోమా–'

'పూలూ దారం చేతికిస్తే దండ కట్టనా! నాదే ముందమ్మా! ఇద్దరూ సరే అంటే బంతాట ఆడిద్దాం...'

అంతలో రామక్రిష్ణ అడగనే అడిగేశాడు.

'మామ్మా! నేను దారాన్నా! పూవ్వునా? నిజం చెప్పెయ్?' అతని గొంతులో కువకువలాడే కోకిల రవం విన్నది హంస. అలా కళ్లెత్తి చూసింది.

'కళ్లెత్తితే సాలు కనకాభిషేకాలు' అనుకున్నాడు రామక్రిష్ణ

'అబ్బాయ్... నన్ను నారీజన పక్షపాతి అని అన్నా ఫరవాలేదోయ్. స్త్రీవాద తత్త్వం అన్నా ఫరవాలేదు. ఆడవాళ్లే పూలు... మగాడు దారం.. ఆడవారిని కట్టుకుంటేనే మగవాడికి అందం... అలంకారం... నిండుతనం... సువాసన అబ్బేది పూల సహవా

తరువాయి 64వ పేజీలో



55వ పేజీ తరువాయి

సంతోనే కదా– ఒట్టి దారం అదెంత జిగేలుమన్నా జడలో తురుముకోరు కదా!'

'అలా అని విడిపూలు ఎన్నున్నా విరులా విరులయ్యేది దండకట్టాకే!' అన్నాడతను.

'ఒయ్ రామకృష్ణా– దండ ..కైదండ..అండ దండ అంటూ పెద్ద పెద్ద మాటలు వద్దు. జత అను బావుంటుంది. ఆడ మగ లాగా దండ–అదే పూలదండ అందగిస్తుంది–'

'ఒకే... ఒకే...'

'నువ్వంటున్నది ఓకేనా... లేక ఒకేనా...?'

'బాబ్బాబూ మీకు పుణ్యం వుంటుంది. మాటలు తాళింపు పెట్టకండి'

'ఇంపుగా మీరిద్దరూ కలిసి కాపురం చేస్తే మేం ఎందుకు?'

తలొంచుకున్నాడతను.

'ఇదో– నువ్వేం తప్పు చేశావని తలొంచుకోవాలి–'

చప్పున తలెత్తాడు. "అదేం లేదండి! తలొగ్గాను తప్ప ఎప్పుడూ నా విషయంలో తలవంపులుండవు. ఆవిడ అందానికి తలొగ్గాను. చదువుకి తలొగ్గాను. సంస్కారానికి తలొగ్గాను... ఇప్పుడు మీ ఎదుటా..."

'మరి... ఎందుకు ఈ దూరం...?'

'దూరం ఎక్కడండి? ఆవిడుండేది అశోక్‌నగర్‌లో నేనుండేది అబిడ్స్‌లో. ఎంత! ఫోన్‌కాల్ దూరం... అంతే...'

'బాబూ! అక్కడా ఇక్కడా ఫోన్లున్నాయి... కనెక్షన్లున్నాయి... మాటలున్నాయి. పలకరింపులున్నాయి.. కానీ మనుషులే దూరంగా...'

'లేదండీ ఫోనూ–రిసీవర్‌లాగా వుండిపోతాం. ఫోను కూడా కాదు, పేజరులా వుంటాం... అదీ కాదు సెల్లార్ ఫోనులా.. ఉగాదొచ్చింది... మీరొచ్చారు. మీకు షష్టిపూర్తి వచ్చింది. మిమ్మల్ని చూశాక, విన్నాక, చదివాక యింకా బతుకు భారం చేసుకుంటే ఏలా? మనసున మల్లెల మాలలూగే వేళలు... గతం నాస్తి...'

'రామకృష్ణా... హంస నీ కోసమే సందేశం తయారుగా వుంచింది.'

'లేదండీ... మీ రాకతో మా జీవితం రసాస్వాదితమైంది. బ్రతుకంటే పోరాటం కాదు.. భవిష్యత్ కోసం సంపాదించి దాచడం కాదు. పంతాలు కాదు... అధికారాలు విజయాలు కాదు.. జీవించడం! సుఖంగా శాంతిగా జీవించ డం! మంగళవారం నాడొచ్చినా ఉగాది మాకు మంచే చేసింది'

అది గబ గబా పరమహంస.

అందరి మనస్సుల్లో... ముఖాల్లో... ఉగాది కళ

## మినీ కథ

# బూచి



అంతవరకూ మండిన పొయ్యి ఒక్కసారి ఆరిపోవటంతో తిరిగి వెలిగించటానికి నానా తంటాలు పడుతోంది శివమ్మ. ఈ మధ్య మూడు రోజులై ముసురు వలన ఎండు కట్టెలు కరువైనాయి.

సరిగ్గా అప్పుడే బయట వీధి వాకిట్లోంచి ఏడుపు వినిపించింది.

"ఏటే సత్తీ! ఏందే గోల" మండుతున్న కళ్లను ఓ చేత్తో తుడుచుకుంటూ కేక పెట్టింది శివమ్మ.

అట్నుంచటే బాణంలా వచ్చింది సత్తి

"సూడమ్మా! తమ్ముడు... నా నోట్స్ రాసుకోకుండా పెన్నిమ్మని పంతం పడుతున్నాడు..." ఏడుస్తూ చెప్పింది.

"ఏదీ నేనొత్తానుండు" అని గబగబ వెళ్ళి నాలుగేళ్ల బుడ్డిగాడిని కోపంగా మూస్తూ– "ఏట్రా నీకు పెన్ను గావాలంట్రా! నా కొడకా! ఏదీ ఆ పెన్ను బూచేదీ సెబ్తాను..." అని కూతురు చేతిలో పెన్ను మూతతీసి వాడి కళ్లకి దగ్గర పెట్టి పొడుస్తున్నట్లుగా భయపెడ్తూ... "ఇదిగో పెన్ను బూచిని పిల్సేదా... ఏడుపాపుతావా!" అంది శివమ్మ.

"ఇద్గో... ఈడేదుత్తే... ఈ పెన్ను బూచిని పిలు..." అని వెళ్ళిపోయింది.

వాడు ఏడ్చినప్పుడల్లా పెన్నుతో భయపెడ్తూనే నోట్స్ పని కానిచ్చింది సత్తి.

శివమ్మ అన్నం వార్చుదించాక పిల్లలిద్దరికీ తినిపించి తను కూడా ఎంగిలపడ్డది. కిటికీ దగ్గర పిల్లలు ఆడుకోసాగారు.

అప్పుడే వీధిలోంచి రబ్బరు బొప్పెలు అమ్మేవాడు అరుస్తూ పోతున్నాడు. అది చూసింది మొదలు బొమ్మ కావాలంటూ పేచీ పెట్టసాగాడు బుడ్డిగాడు.

"అమ్మా! సూడే! తమ్ముడు.. నానా పేచీలూను.. బొమ్మ కావాలంట..." ఫిర్యాదు చేసింది సత్తి.

"ఉండు నే నొత్తన్నాను... ఏరా నీకేటే బొమ్మ కావాల్నా..." "ఊ... ఊ.. కావాలీ... కావాలీ..." కళ్లంట నీళ్లు కారుస్తూ వీధివంక చూపిస్తూ ఏడ్చాడు.

"మన దగ్గర కాసులు మూటేం కూసోనేదురా! నీ కివ్వటాన్కి... ఏడుపు మాన్తావా! లేదా!..." కోపంగా అంది శివమ్మ.

"ఊ... కావాలీ..." ఏడుపు హెచ్చించాడు.

"ఉండు నీ పనిలాక్కాదు. ఏదో బొమ్మ బూచిని పిలుచుకు వత్తాను" అని లోనికి వెళ్లి వెంట్రుకల చుట్టను బొమ్మలా మడిచి తెచ్చి బుడ్డిగాడి కళ్ల దగ్గర ఆడించి భయపెట్టింది.

"అమ్మో! అమ్మో!" అంటు వెరపుగా చేతులడ్డం పెట్టుకున్నాడు. మరోసారి భయపెట్టి లోపలికి వెళ్లిపోయింది శివమ్మ.

బుడ్డిగాడు అక్క ఒడిలో వాలిపోయి నిద్రపోయాడు.

శివమ్మ నడుం వాల్చింది.

సరిగ్గా అప్పుడే వీధిలోంచి వచ్చాడు ఎరకయ్య.

"ఏటే నా నొచ్చేసరికే పడకేసినావే! నా కిన్ని గెంజి మెతుకులు ఎట్టాలని తెల్వదా!" తూలుకుంటూ వచ్చి కంచం వద్ద తిష్టవేశాడు.

"ఏటీ మావా! మల్లా తాగినావా!" బాధగా అంది.

"మల్లేటి మల్లేటి... ఇంకా తాగుతూనే వుంటా.. నువ్వెవతివే సెప్పటాన్కి... నా యిష్టం.." అని శివమ్మ జుత్తు పట్టుకుని వీపువంచి నాలుగు పిడి గుద్దులు గుద్దాడు.

నేలమీదికి ఒరిగిపోయింది శివమ్మ.

ఎరకయ్య తనే వడ్డించుకుని తినేసి తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

తల్లి బాధ చూడలేక కళ్లనీళ్ళు పెట్టుకుంది సత్తి.

"అమ్మా! తమ్ముడేదడిగినా దాన్ని మాన్పించటాన్కి బూచిని సూచించి బయం పెడ్తన్నావు. ఆడుకూడా ఒల్లక వూరుకుంటున్నాడు. మరి అయ్య సేత సారా మాన్పించటాన్కి సారా బూచితో బయంపించకూడదు... అసలు సారా బూచి లేదామ్మా!!" అమాయకంగా అడిగింది సత్తి.

"లేకేమమ్మా... సారా బూచి వుంది. కానీ, కానీ దానికి మీ అయ్యే కాదు.. ఈ జెనాలెవరూ బయపడ్డం నేదు.. . అది మనలాటి వాళ్ల దురదృష్టం..."

కూతురి ఒళ్లో తల వాల్చేసి ఏడ్చింది.

బిక్క చచ్చిపోయింది సత్తి.

కె.కె.రఘునందన్